క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఒంగోలు రూరల్ సీఐ



ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుకు పుష్ప గుచ్ఛం అందిస్తున్న రూరల్ సీఐ

ఒంగోలు టౌన్: ఒంగోలు రూరల్ సీఐగా ఏ శివరామకృష్ణారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సంతమాగులూరు సర్కిల్ నుంచి బదిలీపై ఇక్కడికి ఆయన వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న రూరల్ సీఐ రాంబాబును గుంటూరు రేంజ్ కార్యాలయంలో రిపోర్టు చేయమని ఆదేశించారు.

ఎమ్మెల్యే టీజేఆర్‌ని కలిసిన రూరల్ సీఐ...

చీమకుర్తి: సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబును ఒంగోలులోని ఆయన కార్యాలయంలో ఒంగోలు రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

శింగరకొండ దర్శిని



అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి మూలవిరాట్టు

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణ మాఘ మాసం ఆశ్లేష నక్షత్రం విదియ సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీసేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

గోవా మద్యం పట్టివేత

అద్దంకి రూరల్: అక్రమంగా ఇంట్లో నిల్వ ఉంచిన గోవా మద్యం బాటిళ్లను మంగళగిరి ఏసీబీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలో సోమవారం రాత్రి పట్టుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఈబీ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. మంగళగిరి సమీపంలో పట్టుబడ్డ కేసులో విచారిస్తుండగా అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం నుంచి రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బంది దాడిచేశారు. గ్రామానికి చెందిన ఏ. శ్రావణ్ కుమార్ ఇంటి వద్ద ఉన్న 576 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

- పరిశీలించిన ఏవో రమేష్



పెదకొత్తపల్లిలో పొలాలను పరిశీలిస్తున్న ఏవో రమేష్, ఏఈవో శేషయ్య

మద్దిపాడు: వీఏఏలు ఈ క్రాప్‌లో రబీ పంటలు నమోదు చేస్తున్న తీరును మండల వ్యవసాయ శాఖాధికారి రమేష్ సోమవారం పరిశీలించారు. మండలంలో సాగుచేసిన అన్ని రబీ పంటలను వీఏఏల ద్వారా ఈ క్రాప్‌లో నమోదు చేయిస్తున్నట్లు ఏవో తెలిపారు. ఈ క్రాప్ నమోదును కలెక్టర్, జేసీ, తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారులు సూపర్ చెక్ చేస్తున్నట్లు చెప్పారు. వీఏఏలు సక్రమంగా పంట నమోదు చేస్తున్నారా..లేదా..? అనే విషయాన్ని క్రాస్ చెక్ చేస్తున్నామన్నారు. అందులో భాగంగా మండల వ్యవసాయ అధికారి 137 మంది రైతుల ఈ క్రాప్ నమోదును పరిశీలించాల్సి ఉందని తెలిపారు. అందులో భాగంగా పెదకొత్తపల్లి, ఏడుగుండ్లపాడు రైతులతో కలిసి పొలాలను పరిశీలించామన్నారు. మండలంలోని పది మంది రైతుల సర్వే నంబర్లలో పొలాలను కలెక్టర్ క్రాస్ చెక్ చేయాల్సి ఉందని, జేసీ కూడా మండలంలో 8 మంది రైతుల పొలాల్లో ఈ క్రాప్ నమోదును పరిశీలించాల్సి ఉందని ఏవో తెలిపారు. ఈ క్రాప్ నమోదు వలన ఇన్సూరెన్స్ చేయడానికి, విపత్తుల వలన నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం చెల్లించేందుకు సులువుగా ఉంటుందన్నారు. ఇంకా ఎవరైనా ఈ-క్రాప్ చేయించకుండా ఉంటే వెంటనే ఆయా ఆర్‌బీకేలలో వీఏఏల ద్వారా నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో శేషయ్య, వీఏఏలు ప్రసన్న అవినాష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

- కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం

ఒంగోలు టౌన్: గత 48 ఏళ్లుగా తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణ కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్న అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూల నుంచి కార్యకర్తలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు, శిశువులకు, చిన్నారులకు, ఆహారం, ఆరోగ్యం, వ్యాధి నిరోధక టీకాల గురించి అవగాహన కల్పిస్తూ మెరుగైన సమాజం కోసం పాటు పడుతున్న అంగన్‌వాడీలను ప్రతి ఆవాస కేంద్రంలోనూ నియమించాలని సుప్రీం కోర్టు చేసిన సూచనలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణం అని ఆవేదన వ్యక్తం చేశారు. గత 8 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వ కొత్తగా ఒక్క అంగన్ వాడీ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేమలేదని, నాణ్యమైన ఆహారానికి నిధులు మంజూరు చేయలేదని చెప్పారు. కనీస వేతనాలకు నోచుకోని దుస్థితిలో ఉన్న అంగన్‌వాడీలను ఆదుకోవాలన్నారు. అంగన్‌వాడీలపై పని ఒత్తిడిని తగ్గించాలని కోరారు. అర్హత ఉన్న వారికి పదోన్నతుల్లో రాజకీయ జోక్యాన్ని నివారించాలన్నారు. బెదిరింపులకు పాల్పడుతున్న ఫుడ్ కమిషనర్ మాట తీరు మార్చు కోవాలని, అంగన్‌వాడీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల న్యాయపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు కాలం సుబ్బారావు కోరారు. కార్యక్రమంలో ఎం.రమేష్, అట్లూరు రాఘవులు తదితరులు ప్రసంగించారు. వై.సత్యవతి ధర్నాకు అధ్యక్షత వహించగా సుజాత, ధనలక్ష్మి, పోలమ్మ, ముంతాజ్ బేగం, షభాషిణి, నిర్మల,మల్లేశ్వరి తదతరులు పాల్గొన్నారు. కలెక్టర్‌ను వెళ్లి కలిసిన బృందానికి సాధ్యమైనంత వరకు సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. డీఆర్వో నేరుగా వచ్చి వెంటనే జాయింట్ కమిషన్ వేస్తామని హామీ ఇచ్చారు.

ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

ఒంగోలు: జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ప్రభుత్వాన్ని కోరారు. సీపీఐ పోరుబాటలో భాగంగా స్థానిక ప్రకాశం భవనం వద్ద సోమవారం నిర్వహించిన ధర్నానుద్దేశించి ఆయన పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా 32 లక్షల నివేశన స్థలాలు ఇచ్చినా.. వాటిలో కొన్ని నివాసయోగ్యంగా లేవన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కేవలం రూ.1.80 లక్షలు కేటాయించడంతో రాష్ట్రంలో ఎక్కడా ఇళ్ల నిర్మాణాలు జరగడంలేదన్నారు. పెరిగిన ధరలతో బేస్‌మెంట్‌కు కూడా సరిపోవడం లేదని, రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. ఆ మేరకు ఈ నెల 22న విజయవాడలో సీపీఐ పోరుబాట జరుగుతుందని తెలిపారు. ధర్నాలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు క్విస్ విద్యార్థిని



విద్యార్థిని అభినందిస్తున్న క్విస్ విద్యాసంస్థల కార్యదర్శి సూర్యకళ్యాణ్ చక్రవర్తి

ఒంగోలు: ఖేలో ఇండియా జాతీయస్థాయి కర్లింగ్ పోటీలకు ఒంగోలు క్విస్ ప్రథమ సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థిని తన్నీరు భార్గవి ఎంపికైంది. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలో జరిగే ఖేలో ఇండియా జాతీయ స్థాయి కర్లింగ్ పోటీలకు ఎంపికవగా.. ఆమెను క్విస్ విద్యాసంస్థల కార్యదర్శి నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ వై.హనుమంతరావు అభినందించారు. హెచ్‌వోడీ డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఇతర అధ్యాపకులు క్రీడాకారిణిని అభినందించారు.

పార్లమెంట్‌లో ఎంపీ మాగుంట ప్రశ్న

- వైద్య విద్యార్థులకు దేశీయ అవకాశాల మెరుగుదలపై...

ఒంగోలు: వైద్య రంగంలో నాణ్యమైన ఉన్నత విద్య లేమితో, వైద్యపట్టాలు/డిగ్రీలు పొందేందుకు మన విద్యార్థులు విదేశాలకు వెళ్లడం, దాని నివారణకు ప్రభుత్వం చేపట్టిన పథకాలు, కార్యక్రమాల గురించి ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ప్రశ్న లేవనెత్తారు. 2021 నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంజూరు చేసిన వైద్య కళాశాలల గురించి ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయక మంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ సమాధానమిస్తూ దేశంలో ప్రభుత్వ/ప్రైవేటు వైద్య కళాశాల లేని, ముఖ్యంగా పేద/వెనుకబడిన, ఆకాంక్ష కలిగిన జిల్లాల్లో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సెంట్రల్లీస్పాన్సర్డ్ స్కీం కింద 2020లో మొత్తం 157 కళాశాలలను ఆమోదించారన్నారు. దేశంలో వైద్య విద్య సౌకర్యాలు, వైద్య ప్రమాణాల పెంపునకు నూతన వైద్యకాలేజీల ఏర్పాటు, సీట్ల పెంపుదల, స్థాయి పెంపు, ఎయిమ్స్ ఏర్పాటుతో పాటు అధ్యాపకులు, సిబ్బంది, పడకల పెంపు, మౌలిక సదుపాయాల విషయంలో నిబంధనల సడలింపు, డీఎన్‌బీ అర్హతను గుర్తించడం, సిబ్బంది వయోపరిమితి 70 ఏళ్లకు పెంపుదల మొదలైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పిడుగురాళ్ల, పాడేరు, మచిలీపట్నంలో మూడు నూతన వైద్యకళాశాలలను ఆమోదించినట్లు తెలిపారు. 150 ఎంబీబీఎస్ సీట్లు, 11 కాలేజీల్లో 1040 పీజీ సీట్ల పెంపుదలకు ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. పీఎం స్వస్థ్య సురక్ష యోజన కింద 3 ప్రభుత్వ వైద్య కళాశాలల స్థాయి పెంపునకు సూపర్ స్పెషాలిటీ బ్లాక్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మంగళగిరిలో ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌ను స్థాపించినట్లు కేంద్ర మంత్రి వివరించారు.

కల్యాణమస్తు, షాదీతోఫాకు దరఖాస్తు చేసుకోవాలి

బల్లికురవ: ప్రభుత్వం వివాహాలు చేసుకునే జంటలకు అందజేస్తున్న కల్యాణమస్తు, షాదీ తోఫాకు గ్రామ సచివాలయాల్లో అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ సోమవారం తెలిపారు. వివాహ శుభలేఖలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

కోవిడ్ వర్కర్లకు జీతాలు అందించాలని మేయర్‌కు వినతి



మేయర్ గంగాడ సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న కోవిడ్ వర్కర్లు

ఒంగోలు సబర్బన్: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కోవిడ్ వర్కర్లకు జీతాలు విడుదల చేయాలని నగర మేయర్ గంగాడ సుజాతకు సోమవారం వినతిపత్రం అందజేశారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో ఆమెను కలిసిన కోవిడ్ వర్కర్లు.. తాము పడుతున్న ఇబ్బందుల గురించి మేయర్‌కు విన్నవించారు. వెంటనే జీతాలు విడుదల చేయాలని అధికారులను మేయర్ ఆదేశించారు. మేయర్‌ను కలిసిన వారిలో సీఐటీయూ నాయకుడు శ్రీరాం శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

ఒంగోలు: కరెన్సీ నోట్లపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరి పోతుల పరశురాం డిమాండ్ చేశారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ప్రారంభించిన ప్రజాపోరు యాత్ర సోమవారం ఒంగోలు చేరుకుంది. ఈ యాత్రకు దళిత సంఘాల నేతలు స్వాగతం పలికారు. స్థానిక చర్చిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పరశురాం మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగం అమలుచేయాలని ఇప్పటికే అనేక పోరాటాలు చేశామన్నారు. భారత రాజ్యాంగంలో రిజర్వు బ్యాంకును స్థాపించాలని ప్రతిపాదించి.. స్థాపించిన వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. అటువంటి మహనీయుని ఫొటో కరెన్సీ నోట్లపై ఎందుకు పెట్టడం లేదంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలుచేయాలని కోరుతున్న ప్రజాప్రతినిధులు.. కరెన్సీ నోట్లపై ఆయన ఫొటో ముద్రించాలని పార్లమెంట్‌లో ప్రశ్నించాలన్నారు. ఇందుకు ఇప్పటికైనా పార్లమెంట్‌లో చట్టం చేయాల్సిన అవసరాన్ని ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి గుర్తించాలన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు, దళిత హక్కుల సాధన సమితి అధ్యక్షుడు ముప్పవరపు గోపి, జై జనం పార్టీ అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్, దళిత బహుజన నాయకులు పాల్గొన్నారు.

తెలుగు సినిమాకి కంఠాభరణం.. కేవీ

ఒంగోలు టౌన్: పాశ్చాత్య సంగీతాన్ని ఒంటిచేత్తో అడ్డుకుని సంప్రదాయ సంగీతం గొప్పదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన కళాతపస్వి కె.విశ్వనాథ్ నిర్మించిన శంకరాభరణం తెలుగు సినిమాకి కంఠాభరణం అని ప్రముఖ వైఖానస ఆగమ వేద పండితుడు పరాంకుశం కేశవాచార్యులు కొనియాడారు. స్థానిక సీవీఎస్ రీడింగ్ రూంలో నాగినేని మెమోరియల్స్ ఆధ్వర్యంలో సోమవారం విశ్వనాథ్, వాణిజయరాంల సంస్మరణ సభ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మిడసల మల్లికార్జునరావు, కనుమాల రాఘవులు, కుర్రా ప్రసాద్‌బాబు, డాక్టర్ నూనె అంకమ్మరావు, డాక్టర్ సంత వేలూరి కోటేశ్వరరావు, శేనువకొండ సుబ్బయ్య, గుంటూరు సత్యనారాయణ, కొప్పోలు వెంకటేశ్వరరావు, బాబూరావు, నరసింహం తదితరులు నివాళులర్పించారు.

అలరించిన సుమనసరంజని



సరస్వతీ పూజతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బాలినేని శచీదేవి

ఒంగోలు: స్థానిక సీవీఎస్ రీడింగ్ రూము ఎదురుగా గల ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి బీవీఎస్ వరప్రసాద్ వైద్యశాల, చైతన్య కార్డియాక్ సెంటర్, స్మార్ట్ విజన్ కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సుమనస రంజని గాన సభను స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డాక్టర్ నాగమాధురి నిర్వహించిన గాన కచేరి అందరినీ ఆకట్టుకుంది. ప్రముఖ నాదస్వర విద్వాంసుడు త్రోవగుంట షేక్ కస్సూర్ మస్తాన్‌సాహెబ్‌తో పాటు పలువురు సంగీత కళాకారులను సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాలినేని శచీదేవి మాట్లాడుతూ డాక్టర్ నాగమాధురి గానామృతం ప్రశంసనీయమంటూ అభినందించారు. తిరుపతి సంస్కృత విశ్వ విద్యాలయం సహాయ ఆచార్యులు బాల సుబ్రహ్మణ్యం, వైద్యుడు డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ కృష్ణచైతన్య, 24వ డివిజన్ కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీశ్వరరావు సహకారం మరువలేనిది



ఢిల్లీశ్వరరావును సత్కరిస్తున్న ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు

చీరాల టౌన్: వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలోని 23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ యూనిట్‌లో హవల్దార్ మేజర్‌గా విధులను సమర్థవంతంగా నిర్వహించి బదిలీపై సికింద్రాబాద్ వెళ్తున్న ఢిల్లీశ్వరరావు సేవలు అజరామరమని పలువురు ఎన్‌సీసీ అధికారులు కొనియాడారు. చీరాల ఎన్‌సీసీ యూనిట్ నుంచి సికింద్రాబాద్‌కు బదిలీపై వెళ్తున్న ఢిల్లీశ్వరరావును కళాశాల ఎన్‌సీసీ అధికారులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్‌సీసీ యూనిట్ సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ఎన్‌సీసీ అధికారులు మేడికొండ రాజేషబాబు, సుబేదార్ సత్యేంద్ర, జేసీవో నాయక్‌లు మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్లకు చక్కగా తర్ఫీదును అందించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఢిల్లీశ్వరరావు కృషి అభినందనీయమన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లతో, ఎన్‌సీసీ అధికారులు, కళాశాల ప్రతినిధులతో సత్సంబంధాలు కలిగిన ఆయన ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు, సిబ్బంది ఉన్నారు.

నల్ల బంగారమే

- అమ్మకానికి సిద్ధంగా నల్లచెరకు
- అద్దంకి నియోజకవర్గంలో 800 ఎకరాల్లో సాగు
- ఎకరాకు రూ. 2.5 లక్షలు, గడ రూ.15 వంతున కొనుగోలు
- పెరగనున్న గిరాకీ



గొర్రెపాడులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న చెరకు తోటలు

బల్లికురవ: వాణిజ్య పంటల ఆటుపోట్లు, వరిసాగుకు పెట్టుబడులు పెరగటంతో నల్లచెరకు సాగు విస్తీర్ణం పెరిగింది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక నాలుగేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురిశాయి. దీనికి తోడు వాతావరణం అనుకూలించటంతో చెరకు గడలు దిగుబడులతో గిరాకీ పెరిగింది. బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గం నల్ల చెరకు సాగుకు పెట్టింది పేరు. రైతులు హెచ్‌వీడీఎస్ పథకంలో బోరు ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్, డ్రిప్ ఇరిగేషన్‌తో నీటి వృథా లేకుండా పంటలు పండిస్తున్నారు.

800 ఎకరాల్లో చెరకు సాగు..

బల్లికురవ మండలంలోని గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాల్లో 15 ఏళ్ల క్రితం పది ఎకరాల్లో సాగు చేశారు. పెట్టుబడులు పోను నికరఆదాయం దక్కటంతో ఈ రెండు గ్రామాలకు తోడు వైదన, కొప్పరపాడు, ఎస్ఎల్ గుడిపాడు, కొత్తూరు, రామాంజనేయపురం, అద్దంకి మండలంలోని శింగరకొండ పాలెం చక్రాయపాలెం, గ్రామాలకు సాగు విస్తీర్ణం విస్తరించింది. 800 ఎకరాల వరకు సాగు చేశారు. ప్రస్తుతం తోటల్లో గడలు ఆరు నుంచి 7 అడుగుల ఎత్తు వరకు పెరిగి పక్వానికి వచ్చి అమ్మకానికి సిద్ధమయ్యాయి. ఎకరాకు 12 వేల నుంచి 13 వేలవరకు అడుగు ముక్కలు చేసి తొలకరి వర్షాలకు మే చివరి వారం నుంచి జూన్ చివరి వారంలోపు బోదెలు చేసి నాటారు.

అమ్మకానికి సిద్ధం..

సకాలంలో వర్షాలు కురవటం వాతావరణం అనుకూలించటం తోటల్లోని గడలు అమ్మకానికి సిద్ధమయ్యాయి. వ్యాపారులు తోటల వద్దకు వచ్చి ఎకరాలకు రూ. 2.5 లక్షలు చెల్లించి లేదా గడ ఒక్కక్కటికి రూ. 15 వంతున కొనుగోలు చేస్తున్నట్లు రైతులు సాక్షికి వివరించారు. ఎకరా తోటలో 20 వేల గడల నుంచి 21 వేలవరకు దిగుబడులు వస్తున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 15 నుంచి రాష్ట్రంలో జరిగే వివిధ తిరునాళ్ల ఉత్సవాలకు ఇక్కడ నుంచే చెరుకుగడలను వ్యాపారులు కొనుగోలుతో ఎగుమతి చేస్తారు. సొంత భూమిలో సాగుదారుకు రూ. లక్ష పెట్టుబడి, కౌలు భూమి సాగుదారుకు రూ. 1.4 లక్షలు అవుతున్నట్లు రైతులు వివరించారు.

రోడ్లపైనే అమ్మకాలు..

గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాలకు చెందిన సన్న, చిన్నకారు రైతులు అర ఎకరా నుంచి ఎకరా వరకు పొలాన్ని కౌలుకు తీసుకుని చెరకు సాగు చేశారు. గడలు అమ్మకానికి సిద్ధంతో గడలు ఆటోల్లో వేసుకుని ప్రతిరోజు మేదరమెట్ల-నార్కెట్‌పల్లి నామ్ రహదారిలోని కొప్పరపాడు విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంతానికి తెచ్చి అమ్మకాలు చేపడుతున్నారు. పది గడలకు ఒక కట్టగా కట్టి రూ. 170 నుంచి రూ. 200 వరకు విక్రయిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ రోడ్డుతోపాటు కొప్పరపాడు-వినుకొండ, రోడ్లల్లో కూడా అమ్మకాలు జరుగుతున్నాయి. హోల్ సేల్ రిటైల్ అమ్మకాలు జరుగుతున్నాయి. హోల్‌సేల్ రిటైల్ అమ్మకాలకు కొప్పరపాడు సెంటర్ పెట్టింది పేరు.



ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్న లారీ



కొప్పరపాడులో చెరకు అమ్మకాలు

ఎకరన్నరలో సాగు చేశా..



ఎకరన్నర పొలం కౌలుకు తీసుకుని చెరకు సాగు చేశా. ఆరేళ్లుగా చెరకు సాగుతో పెట్టుబడులు పోనూ నికరఆదాయం పొందుతున్నా. అమ్మకాల్లో తన భార్య సహకారం అందించటం వల్లే కూలీ ఖర్చులు తగ్గాయి. తిరునాళ్ల నుంచి గిరాకీ పెరిగే అవకాశాలు న్నాయి.

– పులి శరత్, కూకట్లపల్లి

దళారుల బెడద లేదు..



ఎనిమిదేళ్లుగా చెరకు సాగుచేస్తున్నాను. దళారుల బెడద లేదు. వ్యాపారులే తోటల వద్దకు వచ్చి ఎకరాలు, గడల వంతున కొనుగోలు చేస్తున్నారు. మహాశివరాత్రి నుంచి అమ్మకాలు ఊపందుకుంటాయి. రెండు నెలలపాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో తిరునాళ్ల ఉత్సవాలకు ఇక్కడ నుంచే గడలు ఎగుమతి అవుతాయి.

– తాడిపర్తి అంజిరెడ్డి, కూకట్లపల్లి